క్లుప్తంగా

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): యాసంగి పంట కొనుగోలు రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీసీ నిర్వహించారు. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలన్నారు. గ్రామీణభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో సమస్య లేకుండా వచ్చే 45 రోజుల పాటు ఇరిగేషన్, మిషన్‌భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీసీలో కలెక్టర్ విజయేందిర, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా సహకార శాఖ అధికారి శంకరాచారి, ఆర్‌గఅట నవీన్, డీఏఓ వెంకటేష్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా జైలుకు సంబంధించిన నాన్ అఫీషియల్స్ విజిటర్స్ కమిటీని ప్రభుత్వం నియమించగా సదరు కమిటీ శనివారం జిల్లా జైలును సందర్శించారు. కలెక్టర్ ముగ్గురు సభ్యుల పేర్లను జైళ్ల శాఖ డీజీకి పంపించగా, డీజీ ఆ పేర్లను పరిశీలించి ప్రభుత్వానికి అందజేస్తారు. ఆ తర్వాత ప్రభుత్వం ముగ్గురితో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తోంది. జిల్లా కేంద్రానికి చెందిన బెక్కరి రాంరెడ్డి, రాజా మల్లేష్, సుభాషిణిని నియమించింది. రెండేళ్ల పాటు కమిటీ కొనసాగుతుంది. చిన్న కేసులలో ఖైదీలకు బెయిల్ మంజూరు విషయంపై ఈ కమిటీ సభ్యులు న్యాయమూర్తులకు ప్రతిపాదన చేయవచ్చు. ప్రతి నెల జైలు సందర్శించడం, మెడికల్‌క్యాంపులు ఏర్పాటు చేయడం వంటివి చేస్తారు. సమావేశంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశం పాల్గొన్నారు.

సచార్ కమిటీ సిఫార్సుల అమలుతోనే సంక్షేమం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాజేంద్ర సచార్ కమిటీ సిఫార్సుల అమలుతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జహంగీర్‌బాబా అన్నారు. రాజేందర్ సచార్ వర్ధంతి సందర్భంగా శనివారం సొసైటీ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జహంగీర్ బాబా మాట్లాడుతూ సచార్ కమిటీ నివేదికతోనే దేశంలోని మైనార్టీల స్థితిగతులు వెలుగులోకి వచ్చాయన్నారు. రాజకీయ, సామాజికంతో పాటు అన్ని రంగాల్లో ముస్లింలు వెనుకబడి ఉన్నారని సచార్ తన నివేదికలో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, మహెబూబ్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు మెరుగైన సేవలు అందించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మాజీ సైనికులకు మెరుగైన సేవలు అందించాలని సైనిక సంక్షేమ శాఖ జనరల్ మేనేజర్ అజయ్ మిశ్ర అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఉన్న సైనిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ సైనికులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం రికార్డులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో అధికారులు సుమిత్‌కుమార్, భరద్వాజ్, రాజాదత్త, జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఎంఆర్‌కే రెడ్డి, అడ్వైజర్ వెంకటయ్యగౌడ్, సభ్యులు ప్రసాద్, సైనిక్ వెల్ఫేర్ స్టాఫ్ కంటీన్ మేనేజర్ సాయిరెడ్డి పాల్గొన్నారు.

బోరుమోటార్ ప్రారంభం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీనగర్ ట్రస్టులో బోరుమోటార్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత శనివారం ప్రారంభించారు. నీటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆమె వెల్లడించారు. గాంధీనగర్ ట్రస్టులోని పది శాతం భూమిలో పార్కు నిర్మాణం చేపట్టాలని వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి

నవాబుపేట: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డిలు సూచించారు. శనివారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందించారు.

కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధర

● ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులకు మద్దతు ధరతో పాటు అదనంగా బోనస్ లభిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్ద గోప్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పని చేస్తుందన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు పడతాయని తెలిపారు. గ్రేడ్ ఏ రకం సన్నాలకు రూ. 2320, దొడ్డు రకం ధాన్యానికి రూ.2,300 మద్దతు ధర ఇస్తారని తెలిపారు. సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ లభిస్తుందన్నారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కతలప్ప, వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ రాజేందర్ అగర్వాల్, ఏపీఎం రామన్న పాల్గొన్నారు.



పెద్ద గోప్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

చిన్నచింతకుంట: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని బండ్రపల్లి గ్రామంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న టీచర్ పుష్పలత పదవీవిరమణ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా సత్కరించారు.

కరివేన ప్రాజెక్టుపై ఎమ్మెల్యే సమీక్ష

దేవరకద్ర: కరివేన ప్రాజెక్టుపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టులో జరుగుతున్న పనుల గురించి, చేపట్టబోయే పనులపై ఆరా తీశారు. పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

‘పెద్దర్పల్లి యువకుడిని స్వగ్రామానికి రప్పిస్తాం’



హన్వాడ: పెద్దర్పల్లికి చెందిన మ్యాతరి గోపాల్ దుబాయ్‌లో చిక్కుకుని ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బాధిత యువకుడిని రప్పించేందుకు చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. శనివారం ‘సాక్షి’లో వచ్చిన కథనంపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పందించి ఈ విషయాన్ని స్థానిక నాయకులకు తెలిపారు. దుబాయ్‌లో యువకుడు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయాన బాధితుడికి ఫోన్ చేసి తెలుసుకున్నారు. ఈమేరకు స్థానిక నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ బాధితుడి ఇంటికి వెళ్లి కుటుంబీకులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీరాంగౌడ్, యాదయ్యగౌడ్, రామస్వామిగౌడ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేద్దాం



అడ్డాకుల: రాజ్యాంగ పరిరక్షణకు అందరం కలిసి కృషి చేద్దామని మూసాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్ అన్నారు. మూసాపేట మండలంలోని నిజాలాపూర్, మహ్మదుస్సేన్‌పల్లి గ్రామాల్లో శనివారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్‌లో ఆయన పాల్గొని పాదయాత్ర చేశారు. కులాలు, మతాల మధ్యలో చిచ్చు పెడుతూ కొందరు రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టడానికి అందరు ముందుకు రావాలని కోరారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వి.రాంచందర్, శాఖాపురం శ్రీనివాసులు, టైలర్ రాములు, దేవన్నయాదవ్, నారాయణ, గంగపురి, అంజనేయులు, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, రమేష్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

మనబడికి అండగా ఉండాలి

నవాబుపేట: మన బడికి మనం అండగా ఉండాలని సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రైవేట్ బడులు పెద్ద ఎత్తున ప్రచారాలతో హోరెత్తిస్తున్న తరుణంలో ప్రభుత్వ బడులకు సైతం పెద్దగా ప్రచారం చేసేలా పాఠశాల పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపటం సంతోషకరమన్నారు. అందరు తమ వంతుగా ప్రభుత్వ బడులకు చేయూతనిస్తూ రావాలని ఆయన సూచించారు. అప్పుడే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతాయన్నారు. వంద ఏళ్ల చరిత్ర గల పాఠశాల తాజాగా అభివృద్ధి కార్యక్రమాలతో ముందుండటం గొప్ప విషయమన్నారు. వార్షికోత్సవంలో విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు అలరించాయి. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగ్యానాయక్, మాజీ జెడ్పీటీసీ ఇందిరాదేవి, ప్రొఫెసర్ సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గోపాల్, సీనియర్ సిటిజన్ నర్సింహులు, వెంకటేశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపై చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

జడ్చర్ల టౌన్: ప్రధాని మోదీపై కాంగ్రెస్ పార్టీ నాయకులు అద్దంకి దయాకర్ చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బీజేపీ అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల కిందట ఈడీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అద్దంకి దయాకర్ పీఎం మోదీపై అనుచిత వాఖ్యలు చేశారని మండిపడ్డారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లటంతోపాటు హిందువులకు రక్షణగా నిలుస్తున్న ప్రభుత్వాన్ని, ప్రధానమంత్రిని ఇష్టారాజ్యంగా మాట్లాడటం సబబు కాదన్నారు. సమావేశంలో బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యంబీ బాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కోడ్గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యార్డు చైర్‌పర్సన్ జ్యోతి

జడ్చర్ల: జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డు, మండలంలోని కోడ్గల్ గ్రామాలలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బాదేపల్లి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జ్యోతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పని చేస్తుందని, వరి ధాన్యానికి మద్దతు ధర దక్కే విధంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. కోడ్గల్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్‌యాదయ్య, జిల్లా కిసాన్ ఖేత్ అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఖాజా పాష, నాయకులు సాయిరెడ్డి, ఇమ్ము పాల్గొన్నారు.

దళారుల చేతుల్లోకి ధాన్యం వెళ్లొద్దు

రాజాపూర్: రైతులు పండించిన ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని బాలానగర్, రాజాపూర్ ఉమ్మడి మండల మార్కెట్ చైర్‌పర్సన్ గుమ్మళ్ల అశ్విని పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. రైతులు పండించిన చివరి గింజవరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్, తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, నాయకులు నరహరి, శ్యాంసుందర్‌రెడ్డి, డైరెక్టర్ రమణ, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన



అడ్డాకుల పాఠశాలను సందర్శించిన విద్యార్థులు

అడ్డాకుల: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉత్తమ బోధన అందుతోందని అడ్డాకుల జెడ్పీ హైస్కూల్ జీహెచ్‌ఎం జ్యోతి అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లి తండా ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు శనివారం సమగ్ర శిక్ష ట్వినింగ్ పాఠశాలల సందర్శన కార్యక్రమంలో భాగంగా అడ్డాకుల హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలరాజు, లక్ష్మణ్‌గౌడ్, అన్వర్‌హుస్సేన్, పెద్దమునుగల్‌ఛేడ్ హెచ్‌ఎం శోభారాణి ఉన్నారు.

నూతన విషయాలు తెలుస్తాయి

కోయిల్‌కొండ: ట్వినింగ్ ఆఫ్ స్కూల్స్ ప్రోగ్రాం కార్యక్రమం ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలు తెలుస్తాయని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ట్వినింగ్ ఆఫ్‌స్కూల్స్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ఏఎంఓ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్‌జీ, సీఆర్పీలు హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ శైలాశ్రీ

సాక్షి, నెట్‌వర్క్: రోజువారి ఆహారంలో పోషకాలు ఉండేలా చూసుకోవాలని ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ శైలాశ్రీ సూచించారు. పోషణ పక్షోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో ప్రాజెక్టు స్థాయి పోషణ పక్షం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఎంపీడీ ఓ కరుణశ్రీ మాట్లాడారు.

- మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ స్థానిక 9, 10, 21, 41వ డివిజన్ల పరిధిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ‘పోషణ పక్షం’ నిర్వహించారు.
- జడ్చర్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోషణ సమావేశంలో డీడబ్ల్యూఓ జరీనా పాల్గొని ప్రసంగించారు. సమావేశంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, సీడీపీఓ శోభారాణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.
- అడ్డాకుల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలో పోషణ్ పక్వాడ–2025 కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై పిల్లలు, గర్భిణులకు మండల ఆయుర్వేద వైద్యురాలు లావణ్య అవగాహన కల్పించారు.
- దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వేడుకలు నిర్వహించారు.
- హన్వాడ మండలంలోని ఇబ్రహీంబాద్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పక్షోత్సవాలు నిర్వహించారు.

యూత్ లీడర్ కాంక్లేవ్‌లో జడ్చర్ల విద్యార్థుల ప్రతిభ



బాలకిష్టారెడ్డి చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న సదాశివయ్య

జడ్చర్ల టౌన్: రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో లీడర్స్ కాంక్లేవ్ ఫర్ బెటర్ ఎర్త్ (మెరుగైన భూమాత కోసం లీడర్ల సమావేశం) అన్న అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో జడ్చర్ల డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ‘భూమిని కాపాడుకుందాం’ అనే అంశంపై 30 స్టాళ్లు ఏర్పాటు చేయగా కళాశాల విద్యార్థులకు ప్రథమ బహుమతి దక్కింది. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 3 ప్రోగ్రాం ఆఫీసర్ డా.సదాశివయ్య నేతృత్వంలో 10మంది విద్యార్థులు తెలంగాణ బొటానికల్ గార్డెన్, అనేక రకాల విత్తనాలు, పాముల సంరక్షణ అనే అంశాలపై ఏర్పాటు చేసిన స్టాల్‌కు బహుమతి లభించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. స్టాళ్లను కళాశాల ప్రిన్సిపాల్‌డా. సుకన్య సందర్శించి విద్యార్థులను అభినందించారు. స్టాళ్లలో ఎన్‌సీసీ ఏఎన్‌ఓ డా. రాజేశ్వరి, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి



మన్యంకొండ చౌరస్తాలో స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: భూ భారతి–ఆర్‌ఓఆర్ చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. మన్యంకొండ చౌరస్తా సమీపంలో ఈనెల 25న నిర్వహించబోయే మండల స్థాయి భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు కోసం స్థలాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ రైతుల కళ్లల్లో ఆనందం నింపేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి రైతులను దగా చేసిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుందర్‌రాజ్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు భూ భారతి చట్టంపై అవగాహన

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు శేఖర్, రాజునాయక్ తెలిపారు.

మన్యంకొండలో ఆరాధన మహోత్సవం



పూలతో అలంకరించిన లక్ష్మీనరసింహ స్వామివారి కమండలం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సోళిపురం శ్రీమాన్ దత్తాత్రేయ లక్ష్మీ నరసింహ్మ యోగానంద స్వాముల వారి ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం హనుమద్దాస్ మండపంలో స్వామివారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో స్వామివారు మన్యంకొండలో తపస్సు చేయడంతో పాటు ఆయన వాడే పాదుకలను, కమండలాన్ని ఇక్కడ్నే వదిలిపెట్టి వెళ్లిపోయారు. అప్పటి నుంచి స్వామి ఆరాధన మహోత్సవాలను ఆ పాదుకలకు, కమండలానికి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే ఈ ఏడాది కూడా స్వామివారి ఉత్సవం సందర్భంగా దేవస్థానం మండపంలో పాదుకలు, కమండలాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాదుక పూజతో పాటు పంచామృతాభిషేకం, రామసహస్ర నామార్చన, మహానివేదన, హారతి, మహాపుష్పయాగం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కమండలినికి రకరకాల పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

మెయిన్ పైపులైన్‌కు మరమ్మతు

● పద్మావతికాలనీలో కొత్త గేట్‌వాల్వ్ బిగింపు



మెట్టుగడ్డలోని గేట్‌వాల్వ్ వద్ద మెయిన్ పైపులైన్‌కు చేసిన మరమ్మతు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శనివారం జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద దెబ్బతిన్న మెయిన్ పైపులైన్‌కు మూడు చోట్ల మరమ్మతు చేశారు. పద్మావతికాలనీలోని మహేంద్ర హిల్స్‌కు వెళ్లే దారిలో లీకేజీ అవుతున్న పాత గేట్‌వాల్వ్ స్థానంలో కొత్తది అమర్చారు. వాస్తవానికి కొన్ని నెలలుగా ఈ ప్రాంతాల్లో పైపులైన్‌తో పాటు గేట్‌వాల్వ్ వద్ద నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు వదిలినప్పుడు లీకేజీలు ఏర్పడి భారీగా వృథా అయ్యేది. ఇదే విషయమై గతంలో ‘సాక్షి’ వరుస కథనాలు ఇచ్చింది. చివరకు స్పందించిన మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు తాజాగా ఆయా చోట్ల మరమ్మతు చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

● పాల్గొన్న వందలాది క్రైస్తవులు



మహబూబ్‌నగర్‌లో రన్‌ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల టౌన్: జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం నిర్వహించిన రన్‌ఫర్ జీసస్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. స్థానిక కల్వరి ఎంబీ చర్చి మైదానంలో ప్రారంభమైన ఈ రన్ పాతబస్టాండ్, క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, న్యూటౌన్, ఎల్‌ఐసీ కార్యాలయం, రైల్వే స్టేషన్ చౌరస్తా, ఎర్రసత్యం, తెలంగాణ చౌరస్తాల మీదుగా తిరిగి ఎంబీ చర్చి వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్, వైస్ చైర్మన్ బీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, సహాయ కార్యదర్శి ఇమ్మాన్యుయెల్ రాజ్, కోశాధికారి టీఏ.స్టీవెన్, సహ కోశాధికారి టైటస్‌రాజేందర్, రెవరెండ్ సుందర్‌పాల్, అరుణ్ దేవ్, పన్నా కెవిన్, తోపాటు సంఘ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో జడ్చర్ల పట్టణంలో రన్‌ఫర్ జీసస్ విజయవంతమైంది. యంబీ బేతని చర్చి వద్ద ర్యాలీని పాస్టర్ విలియం బూత్ ప్రారంభించారు. యంబీ చర్చి వద్ద ప్రారంభమైన రన్ ఫర్ జీసస్ ర్యాలీ సిగ్నల్‌గడ్డ, నేతాజీ చౌరస్తా, పాతబజార్ గాంధీ చౌరస్తా నుంచి సిగ్నల్‌గడ్డ మీదుగా తిరిగి యంబీ చర్చి వరకు కొనసాగించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

తాజ్‌ఫుడ్ కోర్టుకు రూ.5వేల జరిమానా

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న తాజ్‌ఫుడ్ కోర్టులో పరిశుభ్రత లేని ఆహారం అందిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపాలిటీ అధికారులు శనివారం రాత్రి రూ.5వేల జరిమానా విధించారు. ఫుడ్‌కోర్టులో చికెన్ బిర్యాని తీసుకున్న కస్టమర్ దుర్వాసన వస్తుందని హోటల్ నిర్వాహకుడికి ఫిర్యాదు చేశారు. అలాంటిది ఏమీ లేదని నిర్వాహకుడు చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. కొందరు కస్టమర్లు సైతం దుర్వాసన వస్తోందని చెప్పడంతో వండిన బిర్యానిని పారవేశారు. చికెన్ కరిని పరిశీలించగా అందులో బొద్దింకను గుర్తించారు. దీంతో నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. అపరిశుభ్రత ఆహా రం అందించినందుకు రూ.5వేలు జరిమానా విధించారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ నాగేష్ హోటల్ నిర్వాహకుడి నుంచి డబ్బులు తీసుకుని రశీదు అందించారు.

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దోపిడీ ఘటన

మహబూబ్‌నగర్ క్రైం: ఆస్పత్రికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లడానికి ఆటో కోసం ఎదురు చూస్తున్న మహిళను తీసుకెళ్లి దోపిడీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. హన్వాడ మండలం వేపూర్‌కు చెందిన వెంకటమ్మ మార్చి 14న జిల్లా కేంద్రంలోని శ్రీరాములు కంటి ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చింది. అదేరోజు తిరిగి వేపూర్ వెళ్లడానికి ఆస్పత్రి ఎదుట రోడ్డుపై ఆటో కోసం ఎదురుచూస్తున్న క్రమంలో భరత్, శోభలు ఆటోలో వచ్చారు. వెంకటమ్మను ఆటోలో ఎక్కించుకుని మయూరీ పార్క్ సమీపంలోని టీబీ ఆస్పత్రి వైపు పొదల్లోకి తీసుకువెళ్లి భయపెట్టి ఆమె దగ్గర ఉన్న తులం బంగారం, 33తులాల వెండి కడియాలు, రూ.400నగదు, ఒక ఫోన్ తీసుకుని వెళ్లిపోయారు. ఇటీవల ఈ ఇద్దరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులలో జైలుకు వెళ్లాగా, బెయిల్‌పై శోభ బయటకు రావడం జరిగింది. ప్రస్తుతం శోభను అదుపులోకి తీసుకోవడం జరిగిందని సీఐ తెలిపారు. ఆటోలలో ప్రయాణం చేసే ప్రతి ఒక్క ప్రయాణికులు ఆటో ట్రాఫిక్ నెంబర్ గుర్తు పెట్టుకోవాలని, ప్రయాణం చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని అనుమానం వస్తే డయల్ 100ఫిర్యాదు చేయాలని సూచించారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన అక్షర విద్యార్థులు




మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని అక్షర ఐఐటీ–నీట్ అకాడమీ విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో సత్తా చాటారు. ఈమేరకు కళాశాలకు చెందిన విద్యార్థులు చరణ్ తేజ 98.78 పర్సెంటేజ్ సాధించగా, శృతి, హర్షవర్ధన్, హస్‌నైన్, అఖిల్ తదితరులు 80 శాతానికిపైగా ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో ఇంటర్ పరీక్షలతో పాటు, పోటీ పరీక్షలకు కూడా సిద్ధం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల: మండలంలోని గొల్లపల్లిలో నివాసం ఉంటున్న రబీన(17) ఈనెల 16 నుంచి కనిపించకుండా పోయిందని సీఐ కమలాకర్ తెలిపారు. ఇంట్లో నిద్రకు ఉపక్రమించిన తరువాత తల్లి కుంతాదేవి మేల్కొని చూడగా, పక్కనే పడుకున్న తన కూతురు కనిపించలేదని శనివారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి



జడ్చర్ల టౌన్: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ మండలంలోని కుర్వగడ్డపల్లి, గంగాపురం, గోప్లాపూర్, లింగంపేట, కోడ్గల్, గొల్లపల్లి, ఆలూర్, బూర్గుపల్లి, కిష్టంపల్లి గ్రామాల్లో పని ప్రదేశాలలో తిరిగి సమస్యలు తెలుసుకున్నట్లు ఎంపీడీఓకు వివరించారు. పనులు ప్రారంభమై 3నెలలవుతుందని, ఇప్పటి వరకు కూలీ డబ్బులు ఇవ్వటం లేదన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నాయకులు యాదయ్య, సాయిలు, నర్సింహులు, శ్యాంసుందర్, కర్ణ, శివాజీలు పాల్గొన్నారు.